

'హెల్మెట్' ఉపయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - కడప : 'హెల్మెట్ ధరించండి.. ప్రమాదాలను నివారించండి.. మొదలగు అంశాలపై జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ (డిఎల్ఎస్ఎ) ఆధ్వర్యంలో ప్రజలకు వాహనదారులకు రోడ్ షో ద్వారా అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డిఎల్ఎస్ఎ చైర్మన్ జి. శ్రీదేవి ఆదేశాల మేరకు, గౌరవ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ సూచనల మేరకు 'ద్విచక్ర వాహనాలు, పిలియన్ డ్రైవర్ల వినియోగదారులు రక్షిత తలపాగా (హెల్మెట్) ఉపయోగించడంపై హైకోర్టు డబ్ల్యూపి. పిల్ నంబర్:116/2024లో ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశాలపై అవగాహన కోసం గోకుల్ లాడ్జి నుండి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ వరకు రోడ్ షో నిర్వహించారు. కార్యక్రమంలో కడప వన్ టౌన్ సిఐ భాస్కర్ రెడ్డి, కోర్టు కానిసేబుళ్లు మహేష్ కిరణ్, పోలీసులు, పార లీగల్ వాలంటరీలు సురేష్ సహాయం, శ్రీనివాసులు, ఈశ్వరయ్య, చిన్న గురవయ్య, లక్ష్మీ భవాని, ప్రజలు పాల్గొన్నారు.

దాడులు ఆపండి..
వ్యవస్థను గాడిలో పెట్టండి

- భయానక వాతావరణం సృష్టిస్తున్నారు
- ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చండి
- దాడిలో గాయపడిన వైసిపి కార్యకర్తకు మాజీ సిఎం జగన్ పరామర్శ



వైసిపి కార్యకర్తను పర్మారిస్తున్న వై.ఎస్. జగన్

ప్రజాశక్తి కడప అర్బన్

రాష్ట్రంలో మును పెన్నడూ లేని చెడు సంప్రదాయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాంది పలికారని పద్ధతి మార్చుకోవాలని మాజీ సిఎం, వైసిపి రాష్ట్ర అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి హెచ్చరించారు. వేంపల్లెలో టిడిపి నాయకుల దాడిలో గాయపడిన వైసిపి కార్యకర్త వేంపల్లి అజయ్ కుమార్ రెడ్డి రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కడపకు మూడు రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన జగన్ విషయం తెలుసుకుని శనివారం దాడిలో గాయపడిన వైసిపి కార్యకర్తలను రిమ్స్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం జగన్ మీడియాతో మాట్లాడుతూ అజయ్‌కుమార్‌రెడ్డి వైసిపికి ఓటు చేశాడన్న ఒకే ఒక్క కారణంతో దాడి చేశారని పేర్కొన్నారు. దాడులో ఏమి సాధిస్తారని ప్రశ్నించారు. ఎన్నికల తరువాత పులివెందులలో ఇలాంటి దాడులు గతంలో ఎన్నాడు లేవని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత దాడులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. దీని ద్వారా ఏమి సాధిస్తారని ప్రశ్నించారు. శిశుపాలుని పాపాలు లెక్కకట్టినట్లు చంద్రబాబు పాపాలు లెక్క కడుతున్నామని తెలిపారు. భవిష్యత్తులో అదే టిడిపికి తిప్పికొడుతుందని హెచ్చరించారు. వైసిపికి ఓటేశారని 20 ఏళ్ల పిల్లాడిని దారుణంగా కొట్టారని పేర్కొన్నారు. చంద్రబాబు రాష్ట్రంలో భయాకన వాతావరణం సష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మీరువేసే ఈబీజం, సాంప్రదాయం మళ్లీ టిడిపి కార్యకర్తలకు చుటుకుంటుందని తెలిపారు. చంద్రబాబు అనుకుంటున్నాడు భయాందోళనకు గురిచేసి వైసిపి కార్యకర్తలకు కొట్టడం ద్వారా ఏదో ఆనందం పొందాలనుటున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా బయాన్ని సృష్టించాలని చూస్తున్నారని పేర్కొన్నారు. చెడు సంప్ర దాయానికి నాంది పలుకుతున్నారు, దయచేసి ఆపండని. ఆపకపోతే మాత్రం ఎల్లకాలం మీరే అధికా రంలో ఉండరు, అధికారం మారిన రోజున ప్రజలు బాబు అన్యా యాలను చూసి శిశుపాలు పాపాలు పండినట్లుగా పాపాలు వేకంగా పండుతున్నాయని హెచ్చరించారు. అధికారం మారిన రోజున ఈ సంప్రదాయం బాబుకే చుట్టుకుంటుందని చెప్పారు. ఈ దెబ్బలు తిన్న వారు మళ్లీ అటువైపు వారిని ప్రతికారం తీసుచుకునేందుకు మీరే బీజం వేస్తున్నారన్నారు. ఇది సరైన పద్ధతి కాదని, నాయకులుగా ఉన్న మనలాంటి వారు ప్రోత్సహించకూడదని పేర్కొన్నారు. అధికారం మారిన రోజున అవి చంద్రబాబుకు చుట్టుకుంటాయని తెలిపారు. టిడిపి కూటమి మోసపూరిత వాగ్దానాల వల్లే పది శాతం ఓట్లు అధికాంగా పడ్డాయని గుర్తచేశారు. రైతు భరోసా, నిరుద్యోగ భృతి ఏమైందని నిలదీశారు. దాడులపై కాకుండా ఇచ్చిన హామీలపై దష్టిసారించాలని హితవు పలికారు. నాయకులుగా ఉన్న మనం ఎప్పుడూ ఇలాంటి దాడుల సంస్కృతిని ప్రోత్సహించే పరిస్థితి రాకూడదని పేర్కొన్నారు. నిరుద్యో భృతి, మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు సరిగా అందడంలేదూ, బ్యాకులు సరిగా సరఫరా కావడం లేదన్నారు. ఇచ్చేవారు సరిగా ఇవ్వడం లేదు, వ్యవస్థ ఏది సరిగా జరగడం లేదని చెప్పారు. వ్యవస్థను ఆడిలో పెట్టాలని కోరారు. మహిళలకు రూ.1,500 చెల్లింపు, రైతులకు రైతు భరోసా, విద్యార్థులకు బడులు ప్రారంభమయ్యాయి అమ్మఒడి అందలేదన్నారు. ఇవన్నీ చేయకుండా దాడుల చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎప్పటికైన శిశుపాలు పాపాలు పండుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్‌టిసి మాజీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

జగన్‌ను కలిసేందుకు పోటెత్తిన జనం

- సామాన్యులకు కలగని దర్శనం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసేందుకు జిల్లాలోని నలుమూలల నుంచి జనం పోట్టేత్తారు. శనివారం సాయంత్రం 6 గంటలకు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పులివెందులకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి జిల్లాలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వచ్చారు. అధిక సంఖ్యలో జనాలు రావడంతో ముందుగా ప్రముఖులకు అవకాశం ఇవ్వడంతో సామాన్యులు కలవలేక పోయారు. చివరకు చేసేది ఏమి లేక నిరుత్సాహంతో వెనుదిరిగి వెళ్లారు. మూడు రోజులపాటు పులివెందుల క్యాంపు కార్యాలయంలోనే ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రతి ఒక్కరిని కలిసేందుకు వీలు కల్పించడానికి ప్రజా దర్బార్ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గండికోట శ్రీకాంత్ రెడ్డి, జిల్లాలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విహారం.. విషాదం





ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకులు

ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు

- ఘోర రోడ్డు ప్రమాదం
- నలుగురు యువకులు దుర్మరణం
- ఒకరికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం
- టిప్పర్‌ను వేగంగా ఢీకొన్న కారు
- మృత్యువులోనూ వీడని స్నేహబంధం
- మృతులందరిదీ కడప నగరం



ఆంజనేయులు నాయక్ | జితేంద్ర కుమార్ | పఠాన్ అఫ్రోజ్‌ఖాన్ | షేక్ అలీం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్/రామాపురం

దురదృష్టం వెంటాడింది. విహారయాత్ర కాస్త విషాదయాత్రగా మారింది. అన్నమయ్య జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు స్నేహితులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. శనివారం తెల్లవారుజామున ఒంటి గంట ప్రాంతంలో కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం కొండవాండ్లపల్లి వద్ద ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే...కడప నుండి ఐదుగురు స్నేహితులు గువ్వలచెరువు ఘాట్ వద్దకు విహారయాత్రకు వెళ్లి ఆనందంగా గడిపారు. ఓ స్నేహితుని కోరిక మేరకు గువ్వల చెరువులో ప్రసిద్ధిగాంచిన పాలకోవా తినడానికి వెళ్ళగా అక్కడి నుంచి మరో స్నేహితుడు రాయచోటిలోని తమ బంధువులతో కలిసి వెళ్దాం అనడంతో రాయచోటికి వెళ్తుండగా మార్గ మధ్యంలో టిప్పర్ లారీని అతివేగంగా వెనుక నుంచి కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న పఠాన్ అఫ్రోజ్ ఖాన్(30), షేక్ అలీం(28), పూజారి ఆంజనేయులు నాయక్(28), జితేంద్ర కుమార్ (24) నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందాగా షేక్ ఖాదర్‌బాషా పరిస్థితి విషమంగా ఉండడంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిర్లక్ష్యపు ప్రయాణానికి నాలుగు ప్రాణాలు గాల్లో కలిసాయి. పఠాన్ అఫ్రోజ్ అలీఖాన్ కత్తర్ దేశంలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. షేక్ అలీమ్ ఫొటో స్టూడియో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు. పూజారి ఆంజనేయులు నాయక్ కడప జిల్లాలోని కమలాపురం పోలీసుస్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. జితేంద్ర కుమార్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతులు కడప నగరానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని ప్రమాద స్థలాన్ని చూస్తే తెలుస్తుంది. ప్రమాద ఘటన సమాచారం అందుకున్న పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నలుగురు స్నేహితులు ఒకే ఘటనలో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాద తీరును పోలీసులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి 'మండిపల్లి'

మృతుల కుటుంబాలకు మంత్రి పరామర్శ

రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబ సభ్యులకు పరామర్శించారు. మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాలకు రూ.25 వేల చొప్పున తన సొంత నిధులతో మండిపల్లి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయాన్ని అందించారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి సహాయం అందిస్తామని బాధ్యత కుటుంబాలకు హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు : మంత్రి

వాహనదారులు అతివేగంగా ప్రయాణించి ప్రాణాలకు హాని తెచ్చుకోరాదని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. రామాపురం మండలం, చిట్లూరు గ్రామ సమీపంలో కారు, ట్యాంకర్ ఢీకొని జరిగిన ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప-చిత్తూరు జాతీయ రహదారిలో వాహనదారులు అతివేగంగా ప్రయాణించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయన్నారు. వాహనదారులు అతివేగంగా ప్రయాణించి తమ ప్రాణాలకు హాని తెచ్చుకోరాదన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాణం ఎంతో విలువైనదని, రోడ్డు ప్రమాదాల మూలంగా ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు లేకుండా ఇకనుంచి జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేయాలన్నారు. ప్రమాదాల బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, కల్వర్టులు, రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ లేకుండా వాహనాలను నడపడం చాలా ప్రమాదకరమని అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోవడం జరుగుతోందన్నారు. జనాభాతో పాటు వాహనాల వినియోగం కూడా పెరుగుతున్న నేపథ్యంలో రవాణా శాఖ, అనుబంధ శాఖల అధికారులు రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి వాహన ప్రమాదాలను అరికట్టే దిశగా పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలన్నారు.

కడప-రాయచోటి ఘాట్లో సొరంగ మార్గం

కడప-రాయచోటి ఘాట్ రోడ్డులో త్వరలో సొరంగం తవ్వి నాలుగు వరుసల రహదారి నిర్మించేందుకు చర్యలు తీసుకోనున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరలో పనులు ప్రారంభించి ఈ ప్రాంతవాసుల చిరకాల కలను నెరవేరుతుందని తెలిపారు. సొరంగ మార్గం ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతంలో చాలావరకు ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. రాబోయే రోజులలో వాహనదారుల సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

విద్యుత్ అంతరాయాలను అరికట్టాలి

ప్రజాశక్తి - కడప : విద్యుత్ అంతరాయాలను అరికట్టి నాణ్యమైన విద్యుత్తును అందించాలని, విద్యుత్తు పనులు చేసేటప్పుడు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ ఆదేశించారు. ముఖ్యంగా విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. శనివారం ఆయన కడపలోని 33/11 కె.వి పక్కిరుపల్లి సబ్‌స్టేషన్ తదితర ప్రాంతాలలోని ట్రాన్స్‌ఫార్మర్లను, లైన్లను క్షేత్రస్థాయిలో స్వయంగా తిరిగి పరిశీలించి అధికారులకు తగు సూచనలు తెలియజేశారు. అనంతరం కడపలోని సిబ్బంది, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ పనులు చేసేటప్పుడు భద్రత నియమాలు విధిగా పాటించాలని ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల తప్ప ఈ సందర్భంలోనూ విద్యుత్ అంతరాయం కలగకూడదని లైన్లలో తిరిగి సమస్యలను గుర్తించి ముందస్తు మరమ్మతులు చేసి అంతరాయలను అరికట్టి నిరంతర నాణ్యమైన విద్యుత్ అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కడప డిఇఇ నాయక్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరికృష్ణ, రామకృష్ణ, షకీల్ అహ్మద్, జూనియర్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు

ప్రజాశక్తి-చెన్నూరు : సాకుడు కుక్కలు, వీధి కుక్కలు(శునకాలు) వ్యాధి బారిన పడకుండా జిల్లా పశువైద్యాధికారులు ఆదేశాల ప్రకారం చెన్నూరు మండలంలోని పలు గ్రామాల్లో టీకాలు వేసే కార్యక్రమం మండల పశు వైద్య అధికారులు ఆయా ప్రాంతాల్లో రైతు సేవ కేంద్రాల్లో పనిచేసే పశు వైద్య సహాయకులు వారిచే కార్యక్రమాన్ని శనివారం నుంచి మొదలుపెట్టారు. ప్రపంచ జెనోసిస్ దినోత్సవంలో భాగంగా కుక్కలకు ఉచితంగా యాంటీ రెబిస్ టీకాలు వేశారు. ఉప్పరపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కడప-బళ్లారి రోడ్డులో దుగ్గనపల్లి వ్యవసాయ పొలంలో 'హోమ్స్ ఫౌండేషన్ అనిమల్స్' మూగజీవాల సంరక్షణ కేంద్రం నిర్వాహకురాలు ఆలూరు రమణమ్మ నడుపుతున్న కేంద్రంలో 30 కుక్కలకు ఉప్పరపల్లి రైతు సేవ కేంద్రం పశు వైద్య సహాయకుడు కళ్యాణ్ ఉచితంగా టీకాలు వేశారు. ఇళ్ల ముందు పెంచుకుంటున్న కుక్కలకు, వీధి కుక్కలకు టీకాలు వేస్తామని చెప్పారు. టీకాలు ఉచితంగా వేస్తున్నారని తెలియజేశారు.

పాఠశాలల నిర్వహణకు నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : పాఠశాలలకు నిర్వహణకు నిధుల మంజూరుకు కృషిచేయాలని డిఇఒ అనురాధను ఎస్‌టియు నాయకులు కోరారు. శనివారం డిఇఒ ఛాంబర్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలలకు మెయింటెనెన్స్ గ్రాంట్స్ మంజూరు చేయలేదని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రధానోపాధ్యాయులు తమ సొంత డబ్బులను పాఠశాలల నిర్వహణకై వెచ్చించారని తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజన్ మారిన దృష్ట్యా అక్కడక్కడా కొన్ని డయేరియా కేసులు వెలుగు చూశాయని చెప్పారు. దీనికి బాధ్యులను చేస్తూ ప్రధానోపాధ్యాయులను, మండల విద్యాశాఖ అధికారులను జిల్లా ఉన్నత స్థాయి అధికారులు అర్థం చేసుకోకుండా మాట్లాడటం భావ్యం కాదని పేర్కొన్నారు. మెయింటెనెన్స్ గ్రాంట్స్ లేకుండా వాటర్ ట్యాంకుల పరిశుభ్రత ఎలా చేపట్టాలో కూడా తెలిపితే బాగుంటుందన్నారు. ఉపాధ్యాయుల పక్షాన మీరైనా పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించాలని కోరారు.

అందరి సహకారంతో
జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తాం

నూతన కలెక్టర్ లోతేటి శివశంకర్



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారుల సమన్వయ సహకారంతో, జిల్లా ప్రజల అభిమానంతో జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు నడిపి ంచేందుకు కృషి చేస్తామని, వైఎస్ఆర్ జిల్లా నూతన కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. శనివారం ఉదయం కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయన కలెక్టర్ ఛాంబర్‌లో వేద పండితులు ఆశీర్వచనాలు అందించగా ఉదయం 11 గంటల సమయంలో కలెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజలు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల సహకారంతో కలెక్టర్‌గా కర్తవ్య నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నెరవేరుస్తూ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు సంతృప్త స్థాయిలో అందేలా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం పలువురు జిల్లా అధికారులు, ప్రముఖులు, పాత్రికేయులు, పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికి కలెక్టర్‌కు తమ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జెసి గణేష్ కుమార్, కడప నగర కమిషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్, పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

గుర్తింపులేని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రవి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా వ్యాప్తంగా అనుమతి లేకుండా నడుస్తున్న చైతన్య, నారాయణ, ప్రయివేట్ విద్యా సంస్థలు అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, విద్యార్థి శాఖ అధికారులు జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రవి సహాయ కార్యదర్శి శేఖర్ కోరారు. శనివారం జిల్లా విద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మున్నీర్ ఖాన్‌కువినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారం చేస్తున్నాయని విమర్శించారు. పాఠశాలలోనే పాఠ్య పుస్తకాలు అమ్ముతూ అక్రమంగా వేల రూపాయలు వసూలు చేస్తున్నారని తెలిపారు. టెక్స్ బుక్స్, యూనిఫాం, సైనిక్ వంటి పేర్లతో ఇష్టం వచ్చినట్లు వేల రూపాయలకు వసూలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ నిబంధనను పాటించకుండా అక్రమంగా నడుపుతున్న కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కడప నగరం, బద్వేల్, పోరుమామిళ్ల, మైదుకూరు, ప్రొద్దుటూరు జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులు తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థి తల్లిదండ్రులు నుంచి డబ్బు దొచ్చుకునే ముఖ్య ఉద్దేశంగా కార్పొరేట్ విద్యసంస్థలు ఉన్నాయని చెప్పారు. ఇలాగే ఉంటే భవిష్యత్‌లో విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. అలాంటి విద్యా సంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

వృద్ధాశ్రమంలో జడ్జి తనిఖీలు

ప్రజాశక్తి -గోపవరం : పట్టణంలోని ఆనంద నిలయం నిరాశ్రయుల ఆశ్రమాన్ని మండల లీగల్ సర్వీసెస్ సీనియర్ సివిల్ జడ్జి వై.జె. పద్మ శనివారం తనిఖీ చేశారు. వృద్ధులకు పండ్లుకు పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వృద్ధులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఏమైనా ఉంటే కోర్టు ఉత్తర్వుల ద్వారా అందించి న్యాయం చేస్తామన్నారు. అనంతరం వైద్య శిబిరం ఏర్పాటు చేసి వృద్ధులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ బృందం, ప్రభుత్వాస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ చంద్రహాసన్ రెడ్డి, రాంప్రసాద్, ఆశా వర్కర్లు, ఆశ్రమం నిర్వాహకులు రవికుమార్ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ రాజీనామా

ప్రజాశక్తి - వేంపల్లె : ఆర్‌జెయుకెటి పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటి డైరెక్టర్‌గా పని చేస్తున్న కుమార స్వామి గుప్తా తన పదవికి శనివారం రాజీనామా చేశారు. వైసిపిప్రభుత్వ పాలనలో డిసెంబర్ నెలలో కుమార స్వామి గుప్తా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోపై స్థాయి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు డైరెక్టర్ పదవికి కుమార స్వామి గుప్తా రాజీనామా చేసినట్లు తెలిసింది.

కలెక్టర్‌ను సన్మానించిన సలావుద్దీన్

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన లోతేటి శివశంకర్‌ను సేవకులు సయ్యద్ సలావుద్దీన్ సత్కరించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ శివశంకర్‌కు సాదరంగా స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కడపలో సలావుద్దీన్ చేస్తున్న సామాజిక కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో పేదలకు సహాయం చేసేందుకు అండగా ఉంటానని పేర్కొన్నారు. సయ్యద్ సలావుద్దీన్ మాట్లాడుతూ కడప కలెక్టర్‌లుగా పనిచేసిన ఎంతోమంది మంచి పేరు సంపాదించుకుని వెళ్లారని పేర్కొన్నారు. మీరు జిల్లా ప్రజలకు అండగా ఉండి అభివృద్ధి పథంలో జిల్లాను ముందుకు తీసుకుని వెళ్లాలని కోరారు.

మొక్కలు నాటిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

ప్రజాశక్తి - కడప అర్బన్ : 'మాతృమూర్తి ప్రశంసగా ఒక మొక్కను నాటండి' అంటూ దేశ ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు యోగివేమన విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ -9, 3 ప్రోగ్రాం ఆఫీసర్లు కె. శ్రీనివాసరావు, డాక్టర్ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన భూగ్రహాన్ని మెరుగైందిగా తీర్చిదిద్దడంలో మనందరి తోడ్పాటు అవసరం అన్నారు. ప్రధానమంత్రి ఆకాంక్ష ను నెరవేర్చిన భూమాతను కాపాడుకొందామంటూ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సహ ఆచార్యులు డా.బి. రెడ్డయ్య, కంప్యూటర్ సైన్స్ టెక్నాలజీ విభాగంల విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

గొంతువాపు నివారణకు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి-కలసపాడు : మండలంలోని పశువుల యజమానులందరూ రాబోవు సీజనల్ వ్యాధుల దృష్ట్యా పశువులలో గొంతువాపు నివారణకు టీకాలు వేయించాలని కలసపాడు పశు వైద్యాధికారి ఎ. వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం మండలంలోని బ్రాహ్మణపల్లి రాజుపాలెం గ్రామాలలో పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, సుమారు 300 పశువులకు టీకాలు వేయించారు. కార్యక్రమంలో సర్పంచి సుధా, రామకృష్ణారెడ్డి, సంధ్యారాణి పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కలసపాడు : మండల కేంద్రంలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సిపిఎం మండల నాయకులు, గురయ్య, ప్రవీణ్ తెలిపారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాల తెరవడంతో విద్యార్థులకు ఆధార్ అనుసంధానం కోసం, దూర ప్రాంతంలో ఉన్న తెల్లబాడు, పిడుగుపల్లె గ్రామాలకు వెళ్లాల్సి వస్తుందని, అక్కడ కూడా సమయానికి సిబ్బంది లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసినట్లయితే ఉపయోగకరంగా ఉంటుందన్నారు.



సహకార సంఘం జెండా ఆవిష్కరిస్తున్న సిబ్బంది

సహకార సంఘాల ద్వారా అభివృద్ధి

ప్రజాశక్తి - చాపాడు

సహకార సంఘాల ద్వారా రైతుల అభివృద్ధి సాధ్యపడుతుందని అల్లాడుపల్లె సహకార సంఘం బ్యాంక్ పర్సన్ ఇన్‌ఛార్జి బిపి సుగుణ పేర్కొన్నారు. శనివారం 102వ అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా స్థానిక అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు పలు రకాల రుణాలు అందించి, వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సంఘాలను బలోపేతం చేసుకోవాలన్నారు. సిఇఒ జాన్ మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా ఖరీఫ్ సీజన్‌లో రూ.2కోట్ల దీర్ఘకాలిక రుణాలు, పంట రుణాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది రంగా, రైతులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వరదకు పుస్తకాన్ని అందజేస్తున్న అభిమానులు

ఎన్నికల్లో ఎన్ఆర్ఐల పనితీరు అద్భుతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఎన్నికల సమయంలో ఎన్ఆర్ఐల పనితీరు మహాద్భుతం అని ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి కొనియాడారు. కువైట్ ఎన్ఆర్ఐ తెలుగుదేశం సంఘ ఉపాధ్యక్షులు రహంతుల్లా ఆధ్వర్యంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు శనివారం ఎమ్మెల్యేను కలిశారు. గల్ఫ్ కౌన్సిల్ సభ్యులు వెంకట్ కోడూరి ప్రచురించిన చంద్రబాబు జీవిత చరిత్ర, మహాస్వాప్నికుడు పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో కూటమి ఘన విజయాన్ని సాధించిందన్నారు. ఇందుకు ఎన్ఆర్ఐల పాత్ర మరువలేనిదన్నారు. రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి ప్రతి ఒక్కరూ తమ వంతు సహ కారాన్ని అందించారన్నారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రం అభి వృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్ట్, రాజధాని అమరావతి నిర్మాణ దిశగా చర్యలు మొదలయ్యాయని వరద అన్నారు. కార్యక్రమంలో షేక్ ఖదార్‌బాషా, బుల్లేట్ నూర్, సజ్జాద్, పీర్‌బాషా, షామీర్ హుశేన్, ఎస్సీ సెల్ జిల్లా ఆర్గనైజింగ్ మాజీ కార్యదర్శి పబ్బతి దేవదాసు పాల్గొన్నారు.



కుక్కలకు టీకా వేస్తున్న డాక్టర్ శ్రీనివాస

రేబిస్ వ్యాధి రాకుండా కుక్కలకు టీకాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా రేబిస్ వ్యాధి రాకుండా కుక్కలకు టీకాలు వేసినట్లు ప్రాంతీయ పశు వైద్యశాల ఇన్‌ఛార్జి సహాయ సంచాలకులు డాక్టర్ వాసా శ్రీనివాస తెలిపారు. స్థానిక, మండలంలోని ఆయా పశు కేంద్రాలు, రైతు సేవా కేంద్రాల వద్ద శనివారం శ్రీనివాస ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకా వేసే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది సూర్యబాబు, నాగయ్య, పాల్గొన్నారు.

మైదుకూరు : ప్రపంచ జంతువుల సంక్రమిత వ్యాధుల దినోత్సవం సందర్భంగా శనివారం మైదుకూరు పట్టణంలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో 21 పెంపుడు కుక్కలకు యాంటీ రెబిస్ టీకాలు వేసినట్లు పశు వైద్యుడు డాక్టర్ గురివిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్, మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు. **ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..** మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ జూనోసెస్ డేను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువులను సరైన పద్ధతుల్లో పెంచడం ద్వారా వాటి నుండి వచ్చే అనేక వ్యాధులను నివారించవచ్చని సూచించారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జంతుశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సి.నరసింహారావు 1885 జూలై 6న లూయిస్ పాశ్చర్ మొట్టమొదటిసారిగా పిచ్చికుక్క కరిచిన బాలుడికి వ్యాధి నిరోధక టీకా ఇచ్చి ప్రాణాలు కాపాడిన సందర్భానికి గుర్తుగా ఆ రోజును ప్రపంచ జూనోసెస్ డేగా జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్, అధ్యాపకులు అయ్యవారెడ్డి, నవనీశ్వర్ రెడ్డి, రాధారాం, అనురాధ, లక్ష్మి, చెన్న రాయుడు, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నారాయణరెడ్డి

విద్యార్థులు ఆకర్షణకు లోనుకావొద్దు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

విద్యార్థులు ఆకర్షణకు లోనుకాకుండా.. మంచి ఆశయంతో చదవాలని సంస్కృతి స్వచ్ఛంద సంస్థల అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని శ్రీ రమణ మహర్షి ఉన్నత పాఠశాలలో 1985-86బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంఇఒలు శోభారాణి, సావిత్రమ్మ పాల్గొన్నారు. గత పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యా ర్థులు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున ఇద్దరికి అందజేశారు. పాఠశాలకు రూ. 40వేలు విలువ చేసే ఆట సామాగ్రి, మైక్‌సెట్, సైన్స్ సామాగ్రి, లైబ్రరీ పుస్త కాలు అందజేశారు. ఈ సందర్భంగా ఒంటేరు మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ ఎంతో ముఖ్యమైందన్నారు. ఈ దశలోనే మనిషి జీవితం మలుపు తిరుగు తందన్నారు. 1985-86బ్యాచ్ విద్యార్థి చాపాడు ఎంఇఒ వంశీకృష్ణ మాట్లా డుతూ తనకు విద్యాబుద్ధులు నేర్పించిన పాఠశాలకు 13 సంవత్సరాలుగా సేవ లందించడం అదృష్టమన్నారు. ఎంఇఒ సావిత్రమ్మ మాట్లాడుతూ పూర్వ విద్యా ర్థులు పాఠశాలకు సేవలందించడం సంతోషమన్నారు. మరో ఎంఇఒ శోభా రాణి మాట్లాడుతూ ఎయిడెడ్ స్కూల్‌లో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం మంచి పరిణామమన్నారు. పాఠశాల అధ్యక్షులు వెంకటరమణ, ప్రధానో పాధ్యాయులు రవిప్రకాష్, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

కనిపించని వ్యవసాయ శాఖ కార్యాలయం

విధులు ఆర్‌బికెలో, సమావేశాలు తహశీల్దార్ కార్యాలయాల్లో..

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల కేంద్రమైన సింహాద్రిపురంలో వ్యవసాయ శాఖ కార్యాలయం లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దేశానికి రైతే రాజు అని గొప్పలు చెబుతున్న పాలకులు వ్యవసాయ శాఖకు భవనం కూడా లేకపోవడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన మండలంలో వ్యవసాయ శాఖ కార్యాలయం లేక అధికారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో అన్ని మండల కేంద్రాల్లో సొంత భవనాలను ఏర్పాటు చేశారు. అయితే ఈ మండలంలో సైతం సొంత భవనం నిర్మించిన అనతి కాలంలోనే ఎంపిడిఒ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ నిర్మాణాల కోసం ఈ భవనాన్ని తొలగించారు. దీంతో ఏడాదికాలంగా సొంత భవనం లేక అధికారులు రైతు భరోసా కేంద్రంలో విధులు నిర్వహిస్తూ, సిబ్బందితో సమావేశాలను తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు.

వృథాగా పాత పోలీస్‌స్టేషన్ భవనం

సింహాద్రిపురం పాత పోలీస్‌స్టేషన్ భవనం వృథాగా ఉంది. ఈ భవనంలోనైనా వ్యవసాయ శాఖ కార్యాలయం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభం నేపథ్యంలో రైతులు పలు పంటలు సాగు చేశారు. ఆ పంటలకు సంబంధించిన తెగుళ్లు, ఇతర అవసరాల మేర కార్యాలయం ఉంటే అక్కడ అధికారిని సంప్రదించవచ్చని రైతులు అభిప్రాయపడుతున్నారు. మండలంలో విరివిగా ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నారు. సింహాద్రిపురం, తొండూరు మండలాలకు సంబంధించి ఉద్యాన విస్తరణ అధికారిని ఇటీవల కాలంలోనే ప్రభుత్వం నియమించింది. అయితే ఆ అధికారికి సంబంధించి కార్యాలయం లేకపోవడంతో ఉద్యాన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖలకు సంబంధించి కార్యాలయాలను ఏర్పాటు చేసి అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఖాళీగా ఉన్న పాత పోలీస్‌స్టేషన్ భవనం

అట్టడుగు వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్ రామ్ కృషి ఎనలేనిది



జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

అట్టడుగు వర్గాల అభ్యున్నతి, అణగారిన వర్గాల ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్‌రామ్ అని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమ్‌ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ భారత రాజకీయాల్లో బాబు జగ్జీవన్‌రామ్ విలక్షణమైన రాజకీయ నాయకుడని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షునిగా పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. బాబు జగ్జీవన్ జీవితం అందరికీ ఆదర్శం, అనుసరణీయం, స్ఫూర్తిదాయకమని తులసిరెడ్డి తెలిపారు. అఖిల భారతదేశానికి సేవలు అందించిన గొప్ప ఉప ప్రధాని బాబు జగ్జీవన్ అని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రఫాతుల్లా అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, బద్రి, రాఘవయ్య, ఆరుశేర్ల సుబ్బరాయుడు, వినయ్, బాలం సుబ్బరాయుడు, మాస్, ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్, పుల్లయ్య, ఫీరుబాషా పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజ్జీవన్ రావు వర్ధంతిని శనివారం ఎంఎస్‌పి రాష్ట్ర నాయ కులు మునిస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ దేశ సమగ్రాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు అన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి సీనియర్ నాయకులు పోపోడు, రాజశేఖర్, శివారం, కోట సుబ్బయ్య, గడ్డం రాముడు, మారెన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు చంద్ర పాల్గొన్నారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పిచ్చికె బాబు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ ప్రపంచంలో లేని రాజకీయ చరిత్ర ఆయన సొంతమన్నారు. అంతటి రాజకీయ ఉద్దండుడిని భారతరత్న ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య, సమతా దళిత్ యునైటెడ్ కమిటీ అధ్యక్షులు జెజె సైమన్, పుట్టా రవి, ఎమ్మార్పీఎస్ నరసింహులు, బొంతల ఓబులేసు, నాగరాజు, సుబ్బయ్య, ఎస్సీఎస్టీ సెల్ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు మేకల ఆంజనేయులు, సిపిఐ నాయకులు ప్రసాద్, బుడగ జంగం హక్కుల పోరాట సమితి నాయకులు నల్లప్పు, చేనేత ఐక్యవేదిక జిల్లా నాయకులు చెన్నా రామయ్య, శీను, రాజేందర్, ఎంఐఎఫ్ నియోజకవర్గం అధ్యక్షులు కె.బాల ఓబయ్య, ఓబులేసు పాల్గొన్నారు.



జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎఐఎస్ఎఫ్ నాయకులు

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



వన మహోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం

ప్రజాశక్తి - ఖాజీపేట

మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, సకాలంలో వర్షాలు కురవాలంటే మొక్కలు నాటడం ఎంతో ముఖ్యమని బీరం పాఠశాల చైర్మన్ బీరం సుబ్బారెడ్డి, చైర్ పర్సన్ బీరం సరస్వతమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్త నెల్లూరు సమీపంలో ఉన్న బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలలో శనివారం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బీరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. మొక్కలు నాటడం వల్ల కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. మొక్కలు నాటడమే కాకుండా సంరక్షణ బాధ్యత కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. పాఠశాల డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్ మాట్లాడుతూ మొక్కల పెంపకం వల్ల కలిగే ప్రయోజనం, వన సంరక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్వేతా, కాలేజీ ప్రిన్సిపల్ హేమ చందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవన వైవిధ్యంలో మొక్కల పాత్ర చాలా గొప్పది

ప్రజాశక్తి - వేంపల్లె

జీవన వైవిధ్యంలో మొక్కల పాత్ర చాలా గొప్పదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సి పల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. శని వారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు మొక్కలు నాటే కార్యక్ర మాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ఆ మేం కు కళాశాల ఆవరణలో డాక్టర్ చెరసాల యోగాంజనేయులు మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ఆవరణలో మొక్కలు నాటడం ఎంతో శుభపరిణామం అన్నారు. మానవ జీవన ఉత్తేజితంలో బహుళ పాత్రను మొక్కలు పోషిస్తాయని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ మొక్కలు మానవాళి విడుదల చేసే వ్యర్థ రసాయనాల్లో అధిక భాగమైన కార్బన్ డై ఆక్సైడ్‌ను స్వీకరించి మానవ మనుగడకు కావలసిన ఆక్సిజన్ ఇస్తాయని వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద ఉన్న స్థలంలో మొక్కను పెంచి పర్యావరణ పరిరక్షణకు దోహద పడాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మల్లేశ్వరమ్మ, అధ్యాపకుడు శ్రీకాంత్‌రెడ్డి, ఐకెసి కో-ఆర్డినేటర్ సతీష్, సుధాకర్, రాజారెడ్డి, రాధిక, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, గంగాద్రిరెడ్డి, సుబ్బారెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న కళాశాల అధ్యాపకులు

అంబేద్కర్ ఫ్లెక్సీని చింపిన వారిని అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు విజయ్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీని చింపిన దుర్మార్గులను వెం టనే అరెస్టు చేయాలని సిఐటియు జమ్మలమడుగు కార్యదర్శి దాసరి విజయ్ డిమాండ్ చేశారు. శని వారం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొర్లపోలు మండలం దుర్గాడ గ్రామంలో కొంతమంది ఆ గ్రామ ఎస్సీ యువకులు కొన్ని కార్యక్రమాల్లో భాగంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారన్నారు. అయితే అదే గ్రామానికి చెందిన ఉన్నత వర్గాల యువకులు గురువారం రాత్రి కుల దురహంకారంతో అంబే ద్కర్ ఫ్లెక్సీ చింపేయడం సిగ్గు చేటన్నారు. గ్రామ స్తులు సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. అంబేద్కర్ అంటే చాలా చిన్నచూపు చూస్తు న్నారని పేర్కొ న్నారు. ప్రపంచ దేశాలు అంబేద్కర్‌ను కీర్తి స్తున్నాయని, మన దేశంలో మాత్రం అంబేద్కర్‌కి అవమానాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. అంబేద్కర్ ఫ్లెక్సీలను చింపి ఆ గ్రామంలో ఎస్సీలపైన దాడి చేశారో వారిని వెంటనే అరెస్టు చేయా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎ.వినయ్‌కుమార్, బాషా, దివాకర్, మున్నా పాల్గొన్నారు.

హౌసింగ్ లేఅవుట్‌లో పీడీ పరిశీలన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలో నిర్మిస్తున్న మెగా లే అవుట్‌ను శనివారం హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో 8,400 ఇళ్లు మంజూరు కాగా, మెగా లే అవుట్‌లో 7,075 ఇళ్లు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించి అక్కడి సిమెంటు, స్టీలు, ఇసుక తదితర సామగ్రిని పరిశీలించారు. మెటీరియల్ దొంగతనం కాకుండా భద్రతగా కొంతమంది సిబ్బందిని ఏర్పాటు చేయాలని పులివెందుల కమిషనర్ రమణారెడ్డికి రాతపూర్వకంగా లేఖ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఇఇ రాజారత్నం, ఎఇలు సంజీవ రాయుడు, ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.



లే అవుట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ అధికారులు

దాడి కేసులో నలుగురు అరెస్టు

- సిఐ చాంద్‌బాషా

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పులివెందుల రోడ్డులో సతీష్‌రెడ్డి అనుచరుడు అజయ్‌కుమార్‌రెడ్డిపై చేసిన దాడి కేసులో నలుగురు వ్యక్తులకు అరెస్టు చేసినట్లు సిఐ చాంద్‌బాషా తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు చేశామన్నారు. శనివారం పులివెందుల పట్ట ణంలోని శిల్పారామం వద్ద దాడి చేసిన వారిని పట్టు కొని విచారించగా.. గతంలో తమ నాయకులపై అజయ్‌కుమార్‌రెడ్డి అసభ్య పదజాలంతో తిట్టాడని, అంతేకాక సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టాడని చెప్పారన్నారు. సింహాద్రిపురానికి గండ్లూరు హిద యతుల్లా, దొంకుపల్లెకు చెందిన శివకుమార్‌రెడ్డి, కోర గుంటపల్లెకు చెందిన మల్లెల మహేశ్వరరెడ్డి, నల్లచెరు వుపల్లెకు చెందిన రామిరెడ్డి ధరణీశ్వరరెడ్డి అనే వ్యక్తులను అరెస్టు చేసినట్లు సిఐ వివరించారు. దాడిలో పాల్గొన్న మిగతా వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని సిఐ తెలిపారు.



వెంకటరమణను అభినందిస్తున్న సిబ్బంది

ఎంపిడిఒగా వెంకటరమణ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట మండల అభివృద్ధి అధికారిగా వెంకటరమణ శనివారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇదే కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వరించేవారు. ఇక్కడ ఎంపిడిఒగా సావిత్రమ్మ కొనసాగుతుండేవారు. నూతన ఎంపిడిఒగా అదనపు బాధ్యతలు చేపట్టిన వెంకటరమణను సిబ్బంది కలిసి అభినందించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వెంకట సుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో కొత్తగా పండ్ల తోటల సాగు చేసే రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఉపాధి హామీ పథకం ఎపిఒ జయభారతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ముఖ్యంగా చీని, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్స్, జామ, మామిడి, పనస వంటి పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ఉపాధి పథకం నుంచి ప్రోత్సాహం ఇవ్వనున్నట్లు తెలిపారు. పశువులు ఉన్న రైతులు నీటి వసతిగల వారు పచ్చి గడ్డి పెంపకానికి దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న నజీర్ హుసేన్

ట్రిపుల్‌ఐటిలో గంజాయి దొరకడం బాధాకరం

ప్రజాశక్తి - వేంపల్లె

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో గంజాయి దొరకడం చాలా బాధాకరమని టిడిపి ఎమెల్సీ రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌ను శనివారం ఆయన సందర్శించారు. ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, కోర్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. అనంతరం మెస్‌లను పరిశీలించారు. భోజన నాణ్యతపై విద్యార్థులతో ఆరా తీశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహాల్లో మంచాలపై బెడ్లు సరిగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్సీ విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో జరిగిన పరిణామాలు, సంఘటనలు చూస్తే ఆందోళనను కలిగిస్తున్నాయన్నారు. 8,500 మంది విద్యార్థులు ఉన్న ట్రిపుల్‌ఐటిలో అసాంఘిక కార్యక్రమాలు జరగడం శోచనీయమన్నారు. నెల రోజుల లోపు ట్రిపుల్‌ఐటిలో క్రమశిక్షణ విధానంలో విద్యార్థులు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమెల్సీ కోరారు. ఇక్కడ పని చేస్తున్న ఉద్యోగులకు కూడా అనేక సమస్యలున్నట్లు గుర్తించామన్నారు. దీన్ని కూడా సిఎం దృష్టికి తీసుకెళతామన్నారు. అనంతరం కాంట్రాక్టు టీచింగ్ ప్యాకల్టీ గెస్ట్ అసోసియేషన్ తరుపున అధ్యక్షుడు నజీర్ హుసేన్ ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డికి గెస్ట్ ప్యాకల్టీకి మేటర్నిటీ శెలవులు ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. గెస్ట్ ప్యాకల్టీ నుంచి కాంట్రాక్టు టీచింగ్ ప్యాకల్టీగా సెలెక్ట్ అయిన వారికి డిజైన్ ఇవ్వాలంటూ కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్సీ అక్కడే ఉన్న ట్రిపుల్‌ఐటి డైరెక్టర్‌కు ఉద్యోగులకు మేటర్నిటీ శెలవులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జివి రమణ, పోతిరెడ్డి శివ, కావాలి భానుకిరణ్, బొజ్జా మైసూరారెడ్డి పాల్గొన్నారు.

చట్టం ముందు అందరూ సమానులే

- జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి భార్గవి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

చట్టం ముందు అందరూ సమానులే అని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి భార్గవి తెలిపారు. స్థానిక సబ్ జైలును శనివారం జడ్జి సందర్శించారు. ఈ సందర్భంగా భార్గవి మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. లోక్ అదాలత్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. వాటి ద్వారా కేసులు రాజీ మార్గాన పరిష్కరించుకోవచ్చన్నారు. 498 ఎ, మోటర్ బైక్‌ల ప్రమాదాల గురించి వివరించారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ హర్షవర్ధన్‌రెడ్డి, న్యాయవాది పాలాజి రవి, బివి సుబ్బారావు, జైల్ సిబ్బంది, కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

- సమావేశంలో ఎఒ వెంకటకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు

నూతన ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించాలని మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి సిబ్బందికి సూచించారు. స్థానిక కార్యాలయంలో ఎఒ శనివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం సిబ్బంది ఆయా గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. పిఎం కిసాన్ పథకం రైతులకు సంబంధించి ఫిజికల్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ప్రతిరోజు సాగు చేసిన పంట పొలాలను సందర్శించి రైతులకు సూచనలు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. వంద శాతం రాయితీతో ఉచితంగా అందించేందుకు పొద్దుతిరుగుడు విత్తనాలు ఎన్‌డిఎస్‌హెచ్-1012 రకం మినీ కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మట్టి నమూనాలపై రైతులకు అవగాహన కల్పించి, నమూనాలు సేకరించాలని సూచించారు.